

బాలికల గురుకుల పాఠశాలకు స్థల పరిశీలన



ప్రజాశక్తి- పులిచెర్ల: మండలానికి నూతనంగా మంజూరైన బాలికల గురుకుల పాఠశాల స్థలాన్ని మండలంలోని మతుకువారిపల్లి బస్‌స్టాప్ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సోమవారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరిశీలించారు. ప్రభుత్వ భూమి రికార్డులను తహశీల్దార్ శేషగిరిరావు మంత్రికి చూపించారు. 5 ఎకరాలున్న ఈ భూమిలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు అనువుగా ఉంటుందని మంత్రి సూచించారు.

శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి
'చలో పోలాక్షమ్మ'కు అఖిలపక్షం పిలుపు




అఖిల పక్షం సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - పుత్తూరు , యంత్రాంగం (తిరుపతి జిల్లా)

దళితులు ఆలయంలోకి రావడానికి వీల్లేదని తాళం వేసిన శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని అఖిలపక్షం నేతలు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో వివక్షను సిఎం దృష్టికి తీసుకెళ్లి, చలో పోలాక్షమ్మ ఆలయం చేపడతామన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.మహేష్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. ఈనెల 22న మంగళవారం ఎస్‌పి, కలెక్టర్‌లను కలిసి వినతిపత్రి ఇస్తామని, గురువారం నిరసన దీక్ష చేపడతామని, 28న ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇస్తామని కార్యాచరణ రూపొందించారు. స్పందించకుంటే సెప్టెంబర్ 3వ తేదీ 'చలో రామకృష్ణాపురం పోలాక్షమ్మ గుడి' చేపడతామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దళితులు ఆలయానికి రాకూడదని ఆలయానికి తాళం వేసిన ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. ఆధునిక యుగంలోనూ అంటరానితనం ఏదో ఒక రూపంలో కనిపిస్తూనే ఉందన్నారు. బిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలోని పోలాక్షమ్మ జాతర సందర్భంగా పొంగళ్లు సమర్పించేందుకు దళితులు ఆలయానికి వచ్చారనే కారణంతో ఆలయంలోకి వెళ్లనీకుండా ఆలయ పూజారి దళితులు లోనికి పోకుండా తాళం వేసి వెళ్లిపోయాడన్నారు. ఎంతకీ తాళం తీయకపోవడంతో పోలాక్షమ్మ అమ్మవారికి బయటే పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకుని వెళ్లారన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు కేశవులు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో దళితులకు ప్రత్యేక సంక్షేమ సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశామన్నారు. జనసేన నియోజకవర్గ నాయకులు మెరుపుల మహేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా గ్రామాల్లో కులవివక్షలో మార్పు రాలేదన్నారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కప్పయ్య మాట్లాడుతూ దళితులను నీచంగా చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధనంజయ, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నందయ్య, రమేష్, గజపతి, మురగ, నాదముని, రవి, పరిమళ, మంజుల, విజయ్ పాల్గొన్నారు.

తహాశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు


కెవిబిపురంలో... సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్, మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో తహాశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. కులంపేరుతో దూషించి, వివక్ష చూపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత నాయకులు మీరయ్య, శేఖర్, వెంకటమ్మ, శంకరయ్య పాల్గొన్నారు. **బిఎన్ కండ్రిగలో...** కెవిపిఎస్, వ్యకాసం ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహాశీల్దార్ భార్గవికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ఎన్.రమణయ్య, సుబ్బయ్య, అంకయ్య, బాల గురవయ్య, ఏసుపాదం పాల్గొన్నారు. వెంకటగిరిలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. **నాగలాపురంలో...**మండల కార్యదర్శి మురగేషన్ ఆధ్వర్యంలో తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహాశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందించారు. చిన్నమణి, బాలాజీ, సుబ్బయ్య, గౌసియా, పద్మ పాల్గొన్నారు.



చెరకు రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

చిత్తూరు జిల్లా నిండ్ర వద్ద ఉన్న నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో నిండ్ర క్రాస్ రోడ్ వద్ద రాస్తారోకో జరిగింది .ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా యాజమాన్యం రైతులను మోసం చేసి చెరుకు తోలిన రైతు లకు బకాయిలు చెల్లించకనే కాలయాపన చేస్తున్నా అటు జిల్లా అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గాని రైతులకు రావాల్సిన 35 కోట్ల రూపాయల సొమ్మును చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. నేతాజీ చెరుకు రైతుల సంఘం నాయకులు ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చెరుకు రైతుల బకాయిలపై అసిస్టెంట్ కెన్ కమిషనర్ నిర్లక్ష్యం కారణంగానే రైతులు మోసపోయారని, రైతులను మోసం చేసిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి రైతులకు రావాల్సిన బకాయిలను చెల్లించే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. నిండ్ర ఎస్సై, సీఐలు ఆందోళన కారులను శాంతింపజేసి నిండ్ర తహశీల్దార్‌తో, కలెక్టర్‌తో ఫోన్లో సంప్రదించి పది రోజుల్లోపు గట్టి చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు విరమించారు. ఒకానొక సందర్భంలో రైతులకు పోలీసులకు వాగ్వాదం జరిగి రోడ్డు మీదకి వెళ్లి నిరసన తెలియజేసి ఆందోళనలు దిగారు. దీంతో రోడ్డుపై రాస్తారోకో చేయడం వల్ల దాదాపు రెండు కిలోమీటర్ల మేర రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. రైతు నాయకులు గుణశేఖర్ రెడ్డి, రఘునాథరెడ్డి, సుదర్శన్ నాయుడు ప్రకాష్ నాయుడు రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, ముని శంకర్, పాపయ్య పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న చెరకు రైతులు



పోలీసులతో చెరకు రైతు నాయకుల వాగ్వాదం

23న జాబ్ మేళా



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈనెల 23వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి ఎన్.గుణశేఖర్, జిల్లా ఉద్యోగ ఉపాధి అధికారిణి పద్మజ, పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.జీవన్‌జ్యోతి, డీఈవో విజేయేంద్రరావుతో కలసి జాబ్‌మేళాకు సంబంధించిన గోడపత్రికను కలెక్టర్ అవిష్కరించారు. మెగా జాబ్‌మేళాలో వివిధ రకాల కంపెనీలైన అమర రాజాగ్రూప్, అపోలో ఫార్మసీ, డిక్సన్ టెక్నాలజీస్, ఫ్లిప్‌కార్ట్, చాతుర్య స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోజెంట్ ఈ సర్వీసెస్, పేటీఎం, ఫింకేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, బ్లూస్టార్ క్లయిమేటిక్ లిమిటెడ్, హెచ్‌డిబి ఫైనాన్సియల్ సర్వీసెస్, మహీంద్రా హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, ట్రాన్స్ హోమ్ ఇండియా సర్వీసెస్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, అగిల్ ఎయిర్పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, ఫ్లస్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్, భారత్ ఫైనాన్సియల్ ఇంక్లూషన్ లిమిటెడ్, టిసిఎల్ కంపెనీల వారు మెగా జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి మరియు ఇంటర్, డిగ్రీ ఫెయిల్, పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళా పాల్గొనే అభ్యర్థులు వివరాలకు కోసం 78931 10120, 63009 54441, 9505 601887 ఫోన్ నంబర్లు సంప్రదించాలని తెలిపారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఆర్‌ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న స్పందన, జగనన్నకు చెబుదాం ద్వారా అందిన అర్జీలపై సత్వరమే అధికారులు స్పందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామరు. ప్రజలు అందజేస్తున్న అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలని తెలిపారు. ఈ నెల 1 నుండి 20వ తేదీ వరకు 1,945 అర్జీలు అందగా 1,266 పరిష్కారమయ్యాయని, 679 అర్జీలు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, వీటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దష్టిపెట్టి పనిచేయాలని తెలిపారు. సమస్యల పరిష్కారంలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి అర్జీదారుడు సంతప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అన్నారు. ఏ అర్జీ బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్ళకుండా, రీఓపెన్‌కు తావు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ఈనెల 28న జరిగే జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి సంబంధించి ఈ కేవైసి 87శాతం మాత్రమే పూర్తి అయ్యిందని, దీన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయల ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించి ప్రభుత్వ అధికారులందరూ పబ్లిక్ టెలిగ్రాం యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా గహ నిర్మాణ పురోగతిలో వెనుకబడిన మండలాలు పురోగతిని సాధించాలన్నారు. ఈ సమావేశంలో పిఆర్, ఆర్ అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, శంకర్‌బాబు, డ్వామా పిడి గంగాభవానీ, సిపిఓ ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

గ్రూపులు లేకుండా ముందుకు సాగాలి : మంత్రి పెద్దిరెడ్డి

బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- పుంగనూరు: న్యాయవాదులు అందరూ కలిసి ఐక్యంగా ఉండాలని గ్రూపులు లేకుండా ముందుకు సాగాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ న్యాయవాదులకు బార్ అసోసియేషన్ భవనం చాలా అవసరమన్నారు. ఈసమావేశానికి కూడా ఇది చాలా అవసరమన్నారు. బార్ అసోసియేషన్ కోరగానే ఏర్పాటు చేయాలని నిర్ణయించి కలెక్టర్‌ను కోరడం జరిగిందని చెప్పారు. మనం అడిగిన వెంటనే కలెక్టర్ కూడా అనుమతులు ఇచ్చారని, భవన నిర్మాణం కోసం ఎంపి మిథున్ రెడ్డి రూ.25 లక్షలు, ఎంపి ఎన్.రెడ్డప్ప రూ.20లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా ఈ భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. భవన నిర్మాణం కోసం కోర్టు పరిసర ప్రాంతంలో 5సెంట్ల భూమిని ప్రభుత్వం తరపున కేటాయించారని, దాదాపు రూ.50లక్షలతో బార్ అసోసియేషన్ భవన నిర్మాణం చేపడతామని తెలిపారు. భవన నిర్మాణానికి అయ్యే కర్చు మొత్తాన్ని ఎంపి లాడ్స్ ద్వారా సమకూర్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ఎంపిలు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎన్.రెడ్డప్పలకు న్యాయవాదులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్ కుమార్, పికెఎం ఛైర్మన్ ఎన్.వెంకట్రెడ్డి యాదవ్, స్టేట్‌ఫోక్ అండ్ కల్చరల్ యాక్టివిటీ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్‌బాష, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గల్లా శివశంకర్ నాయుడు, ఆనంద్ కుమార్, న్యాయవాదులు మల్లికార్జున రెడ్డి, అంజిబాబు, జితేంద్ర, పులి రామకష్ణారెడ్డి, ఆకుల చెన్నకేశవులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన మంత్రి పెద్దిరెడ్డి

అసైన్మెంట్ భూముల వివరాలను ప్రకటించాలి

జెసికి సిపిఎం వినతి



జెసికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భూమిలేని గ్రామీణ, పేదలు, దళితుల అభ్యున్నతి, ఆత్మగౌరవం కోసం ఇచ్చిన అసైన్మెంట్ భూములను ప్రభుత్వమే అమ్ముకోవచ్చని ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని సిపిఎం చిత్తూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని వెంటనే జిల్లాలో ఉన్న అసైన్మెంట్ భూముల వివరాలను ఆయా సచివాలయాల దగ్గర నోటీసు బోర్డులో వేయాలని సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన జేసీతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌పై జిల్లాలో అన్ని రాజకీయపక్షాలతో చర్చించిన తర్వాతే సర్వేలు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సచివాలయాల దగ్గర భూముల వివరాలు వేస్తామని చెప్పిన ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ పెట్టలేదని అన్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఇప్పటికే అనేకమంది దళితుల పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం 9/77 చట్టాన్ని సవరించడం వలన పేదలకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను పెత్తందారుల వసమవుతాయని దీని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. రెండున్నర ఎకరాల మాగాని ఐదు ఎకరాల మెట్ట భూమి ఉన్న రైతులు అసైన్డ్ భూములు కలిగి ఉంటే వారిని మినహాయించాలని తెలిపారు. కొన్ని చోట్ల పేదల బలహీనతను ఉపయోగించుకొని పావులో పాతిక ఇచ్చి తమ భూములు పక్కన కలిపేసుకున్నారని, ఇటువంటి అన్యాక్రాంతమైన భూములు తిరిగి ఆ పేదలకు ఇవ్వాలని 9/77 చట్టం చెబుతున్నదన్నారు. ఈ చట్టం ఉండబట్టే భూములు కోల్పోయిన పేదలు పోరాడి లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి తిరిగి పొందుతున్నారు కానీ నేడు ఈభూములను కార్పొరేట్ కంపెనీలకు భూస్వాములకు కట్టబెట్టడానికే చట్ట సవరణ చేసి గవర్నర్ ద్వారా జూలై 31న ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. సవరించిన సెక్షన్3లో భూమి మాస్టర్‌ప్లాన్ పక్కన వ్యవసాయేతర అవసరాల కోసం ఆక్రమించుకున్నట్లయితే ఆ భూములకు మార్కెట్ రేట్ ప్రకారం అసైన్దారులకు డబ్బు చెల్లించాలని సవరణ చేశారు. ఈ సవరణ ద్వారా ఇప్పటికే అన్యాక్రాంతమైన భూములను ఇలాంటి తప్పుడు పద్ధతులు పేరుతో పేదల భూములను రాజమార్గంలో కొట్టేయడానికి భూస్వాములకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. గుండె దురాక్రమణ చేసిన రియల్ ఎస్టేట్ పరిశ్రమలు పెట్టని కాళీ కంపెనీ భూములను అసైన్దారుల పరం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. పేదలు పొందిన అసైన్డ్ భూములను అభివద్ధి చేసుకొని వారి జీవితాలు వారి పిల్లలు భవిష్యత్తు అభివద్ధి చేసుకోవడానికి పెట్టుబడి, సాగునీటి సౌకర్యం ,పరపతి సౌకర్యం కల్పించి వారికి అభివద్ధి చేయాల్సింది పోయి భూములు అమ్ముకోమని ప్రోత్సహించడం అభివద్ధి నిరోధక చర్య. ఇప్పటికైనా ప్రభుత్వం తెచ్చిన సవరణ అసైన్డ్ భూముల హక్కుదారుల కంటే అక్రమంగా దౌర్జన్యంగా అనుభవిస్తున్న భూస్వాములకు మేలు చేయడానికి పిఓటి యాక్ట్ నైన్.9/77 చట్టాన్ని సవరించారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వేచేసే లోపు చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న అసైన్డ్ భూముల వివరాలను నోటిఫికేషన్ పెట్టాలని వినతి పత్రంలో డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా నాయకులు కె. సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య డిమాండ్

ప్రజాశక్తి -పలమనేరు: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఆన్లైన్ వర్క్ పనిభారం తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి. చైతన్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట సిఐటియు పట్టణ అధ్యక్షుడు గిరిధర్ గుప్త ఆధ్వర్యంలో ఆశలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు ఆన్‌లైన్ పనుల భారాన్ని తగ్గించాలన్నారు. వీరికి నాణ్యమైన సెల్ఫోన్ 4 జి సిమ్స్ ఇవ్వాలని, ఆన్లైన్ వర్క్‌పై శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సక్రమంగా పనిచేయటం లేదని, పనిచేయని సెల్ఫోన్లతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగ మాట్లాడుతూ. ఆన్లైన్ వర్కులపై శిక్షణ లేకపోవడంతో ఆశా వర్కర్స్ తీవ్ర ఆందోళనకు, మానసిక వేదనకు గురౌతున్నారన్నారు. ఆశా వర్కర్స్‌ని రోజు విలేజ్ క్లినిక్, సచివాలయాలలో ఉదయం 9 నుండి సాయంత్రం 5గంటల వరకు ఉండాలని, క్లినిక్‌లు క్లీన్ చేయటం, ఓపీ వర్క్, అటెండర్ పనులు చేయించడంతో పాటు ఉదయం సాయంత్రం రెండు సార్లు రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని అధికారులు వేధిస్తున్నారన్నారు. రికార్డ్స్ సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ వర్క్ అన్ని సొంత ఫోన్ ద్వారా చేయాలని వేధిస్తున్నారన్నారు. సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలౌతున్నారని వాపోయారు. పిహెచ్‌కి పిలిపించిన ప్రతి సందర్భంలోనూ టిఎ, డిఎలు ఇవ్వాలని లేదా నెలకు 4,5 సార్లు పిహెచ్సిలకు ఆశా వర్కర్స్‌ను పిలిపించడం ఆపాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల రాజు, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, కెవిపిఎస్ పలమనేరు గంగవరం మండల అధ్యక్షులు పాకాల సుబ్రహ్మణ్యం, గుర్రం సుబ్రహ్మణ్యం, ఆశ వర్కర్స్ యూనియన్ డివిజన్ నాయకులు సావిత్రి, మంగమ్మ, గీత, గుణవతి, రాజేశ్వరి, మంజు, తదితరులు పాల్గొన్నారు.



నాడు- నేడు పనులు పరిశీలించిన కలెక్టర్



అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- సోమల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన పై ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. సోమవారం సదుం మండలంలో పర్యటించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు -నేడు కింద జరుగుతున్న అదనపు తరగతుల నిర్మాణపనులను పరిశీలించారు. 21 తరగతి గదులు మంజూరు కాగా అందులో 14 తరగతి గదులు స్లాబ్‌స్థాయి దాటిందని, తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా చేపట్టడం జరుగుతున్నదని సమగ్రశిక్ష ఏపిసి వెంకట రమణారెడ్డి కలెక్టర్ కు వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభమైన జూనియర్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణం కొరకు కలెక్టర్ స్థలపరిశీలన చేశారు. ఈపర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష ఏపిసితో పాటు సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డిడిలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, తహశీల్దార్ చంద్రశేఖర్, మంత్రి పిఏ తుకారాం, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సోమ శేఖర్‌రెడ్డి, బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి, వైస్ ఎంపీపీ అమరావతి పుత్రాజు, ఎంఈఓ శ్రీరాములు, అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 219 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రతిసోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 219 అర్జీలు రాగా ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 139, మండల లెవెల్ కో- ఆర్డినేటర్ కమిటీ 36, పశుసంవర్ధకశాఖ 1, జిల్లా ఎండోమెంట్ 1, జిల్లా విద్యాశాఖ 2, మండల ప్రజాపరిషత్ 4, నగరపాలక సంస్థ 4, డిఎంహెచ్ఓ 1, పోలీసుశాఖ 1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు 1, జిల్లా రిజిస్టర్ అండ్ స్టాంప్స్ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 1, డిఎల్ఎస్ఓ 2, జిల్లా పంచాయతీ రాజ్ శాఖ1, నేషనల్ హైవే 8, మైన్స్‌శాఖ 1, పిఓఎస్ఎస్ఏ 1, డిఆర్‌డిఏ 1, డ్వామా 1, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 11, అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు తమ వినతులను అందజేశారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:అడిషనల్ ఎస్పీలు అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 30 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆదేశించారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీలు బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మొత్తం 30 ఫిర్యాదులందాయి, వాటి వివరాలు చీటింగ్ 2, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదాలు 2, భూతగాదాలు 8, ఆస్తి తగాదాలు 4, డబ్బు తగాదాలు 5, ఎఫ్ఐఆర్ 3 ఉన్నాయి.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి

అభివృద్ధి మాటల్లో కాదు... చేతల్లో : ఆర్కె రోజా

మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో
రూ.90 లక్షల అభివృద్ధి పనుల ప్రారంభం



ప్రజాశక్తి- నగరి: అభివృద్ధి మాటల్లో కాదు... చేతల్లో చూపుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం మండలంలోని మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.8లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఎన్ఆర్జీఎస్, ఎన్హెచ్ఎం నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, స్వచ్ఛభారత్ నిధులు రూ.3లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, జిల్లాపరిషత్ నిధులు రూ.2.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన తాగునీటి బోరులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం అభివద్ధిని కాగితాలకే పరిమితం చేస్తూ ప్రజలను ఏమార్చేదని ప్రస్తుత ప్రభుత్వం అభివద్ధిని కళ్లకు కట్టినట్లు ప్రత్యక్షంగా ప్రజలకే చూపుతోందన్నారు. మిట్టపాళెంలో ఒకే ప్రాంగణంలో రూ.90లక్షల మేర అభివద్ధి పనులు నేడు ప్రారంభించడమే దీనికి నిదర్శనమన్నారు. గ్రామంలోని రైతులకు పరిపాలనకు సంబందిత సమస్యల పరిష్కారానికి సచివాలయం, వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య రక్షణకు వెల్‌నెస్ సెంటర్, తాగునీటి సరఫరాకు బోరు, ఈ కేంద్రాలకు విచ్చేసే వారి సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ఒక ప్రాంగణంలో ఉందంటే ఇది నిజమైన అభివద్ధి అన్నారు. సచివాలయ పరిధిలోని మేళపట్టు, మిట్టపాళెం గ్రామస్థులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీవో లీలామాధవి, పీఆర్ డీఈ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సతీష్ కుమార్, సీడీపీవో కష్ణవేణి, ఎంఈవో శ్రీదేవి, ఏఈలు సురేంద్రబాబు, శైలేంద్ర, వైద్యాధికారి రమేష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ పరంధామన్, ఈఏలు జ్ఞానకుమార్, మురుగానందన్, నాయకులు వినోద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి



ఈక్రాపు నమోదు పరిశీలిస్తున్న శివకుమార్

ప్రజాశక్తి- సోమల: మండలంలోని రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వేసిన పంటకు సంబంధించి ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నెల్లిమంద, వల్లిగట్ల పంచాయతీలలో ఆర్‌బికె సిబ్బంది చేస్తున్న ఈ పంట నమోదు తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అన్నింటికీ ఈక్రాప్ ప్రామాణికంగా తీసుకోబడుతుందని కాబట్టి ప్రతి రైతు ఈ పంట నమోదు ఆర్బికే సిబ్బంది ద్వారా చేయించుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి తీర్థం పుచ్చుకున్న కృష్ణ



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం పట్టణ పరిధిలోని తంబిగానిపల్లి ప్రాంతంలో స్థాపించిన వినాయక విద్యాసంస్థ అధినేత ఎం.కష్ణ, ఆయన తనయుడు జ్యోతీశ్వర్ హైదరాబాదులో చంద్రబాబు నివాసంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా కుప్పం శాసనసభ్యులుగా నియోజకవర్గ అభివద్ధికి బాబు చేసిన కషిని గుర్తించి, ఆయన నాయకత్వంలో పనిచేయాలన్న ఆకాంక్షతో తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తే గుర్తింపు తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

యూనిఫాం పంపిణీ



ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: ఫౌండేషన్ వ్యవస్థాపకులు లంకిపల్లి గిరిప్రసాద్ (కాలిఫోర్నియా) వారిచే స్పందన ఫౌండేషన్ వారిచే స్పందన ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్యామల దాతత్వంతో బాలికలకు యూనిఫామ్‌ను పంపిణీ చేశారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట ప్రభుత్వ బాలికల కళాశాల ప్రధానోపాధ్యాయులు శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్యామల బాలికలకు సమ దుస్తుల వితరణ చేశారు. స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు లంకిపల్లి గిరిప్రసాద్ (కాలిఫోర్నియా) సౌజన్యంతో ఇంటర్ బాలికలకు సుమారు రూ.20 వేలు విలువ గలిగే 2 జతల యూనిఫామ్‌ను17 మంది బాలికలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బండి ప్రభాకర్‌రెడ్డి, రెడ్డప్ప నాయుడు, షణ్ముగం, అధ్యాపకులు హేమలత, లావణ్య, మాధవి, శ్రీనివాసులు, గోవర్ధన్ రెడ్డి, గాయత్రి, ధనంజయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



ప్రజాశక్తి- యాదమరి: ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రమైన యాదమరిలో వైద్యాధికారి డాక్టర్ సురేఖ సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ర్యాలీ మానవహారాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈర్యాలీలో దోమల వల్ల వచ్చే ప్రాణాంతకమైన జ్వరాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలను నిర్మూలించేందుకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం యాదమరి పట్టణంలో మానవహారం నిర్వహించి సిబ్బందిచే సిహెచ్ఓ లక్ష్మీనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ అనసూయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతపు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- నగరి: జీతపు బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర అధ్యక్షతన ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ పంచాయతి గ్రామాల్లో పారిశుద్ధ పనులు చేసే కార్మికులకు బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటియుసి పట్టణ నాయకులు వేలన్, బాష, మురళి, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం పాల్గొన్నారు.

తాగునీటి బోరు మంజూరు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పత్తికొండ పంచాయితీ పెదినేపల్లి గ్రామంలో ఆరు నెలలుగా తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున గ్రామస్తులు జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులుకి వినతి పత్రం అందజేశారు. ఆయన స్పందించి జెడ్పీ నిధులలో తాగునీటి బోరు మంజూరు చేసి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు.

యూనియన్ బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి- సోమల: యూనియన్ బ్యాంకు సేవలను ప్రజలు, ఖాతాదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలని తిరుపతి రీజియన్ హెడ్ అధికారి రాంప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన సోమలలోని యూనియన్ బ్యాంక్‌ను నూతన భవనంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బిఐ సూచనల మేరకు బ్యాంకు ఖాతాలు కలిగిన ఖాతాదారులు తమ లావాదేవీలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ రుణాలు పొంది సకాలంలో రుణాలను తీర్చి ఆర్థికంగా అభివద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్‌హెడ్ రంగస్వామి, మురళి, మండల స్థాయి అధికారులు, ఖాతాదారులు, సంఘమిత్రలు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న రాంప్రసాద్

దళితులపై ఎన్నాళ్లీ వివక్ష?



ప్రజాశక్తి- పలమనేరు: స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ దళితుల పట్ల అగ్రవర్ణాల వారు వివక్ష చూపడం చాలా బాధాకరమని పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పుత్తూరు గ్రామీణ మండలంలోని గొల్లపల్లిలో ఆదివారం పాలాక్షమ్మ ఆలయంలోనికి దళితులను రానీయక పోవడాన్ని ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు దానికి పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు, వివక్షతలు పెరిగిపోతున్నాయన్నారు. పుత్తూరులో జరిగిన సంఘటనపై జిల్లాలోని మంత్రులు రోజా, నారాయణస్వామి పెదవి విప్పకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరిగితే దళితులంతా ఏకమై సరైన గుణపాఠం చెప్తామని ఆయన హెచ్చరించారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు చిన్ని, రవి, రెడ్డెప్ప, సుబ్బు, భూపతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసుల మహా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా రెడ్డిప్రసాద్

ప్రజాశక్తి- పలమనేరు: ఆంధ్రప్రదేశ్ ఆదివాసుల మహా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా పలమనేర్ రూరల్ మండలం కూర్మాయి గ్రామానికి చెందిన రెడ్డిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. సోమవారం కర్ణాటక రాష్ట్రం బంగారుపేట తాలూకా కామ సముద్రం ఓబిలిలో జాతీయ మూలవాసుల రాష్ట్ర మహాసమావేశం జాతీయ అధ్యక్షులు జిగిని శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కేరళ నాలుగు రాష్ట్రాల ప్రతినిధులు హాజరైనారు. ఈ సమావేశానికి పలమనేరు, గంగవరం ప్రతినిధులు రెడ్డిప్రసాద్, డివి. మునిరత్నం, చిరంజీవి, మణి, సుబ్రహ్మణ్యం హాజరైనారు. ఈసమావేశంలో ఆంధ్ర రిపబ్లిక్ సేన రాష్ట్ర అధ్యక్షులుగా గంగవరం మండలం కలగటూరు గ్రామానికి చెందిన మణిని, రాష్ట్ర ఆర్గనైజర్లుగా డివి.మునిరత్నం, సుబ్రహ్మణ్యం చిరంజీవులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజా సమస్యలపై అన్నిరాష్ట్రాల ప్రతినిధుల సంయుక్తంగా పనిచేసి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తామని తెలిపారు.



ఎన్నికైన ప్రతినిధులతో జాతీయ అధ్యక్షులు జిగిని శంకర్

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న కంట్రోల్ అధికారి ఆనంద్‌రెడ్డి

ప్రజాశక్తి- పులిచెర్ల: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పారదర్శకంగా ఉండాలని ఉపాధి పథకం క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనందరెడ్డి తెలిపారు. మండలంలోని వెంకటదాసరపల్లె పంచాయతీలోని ముంగరవానికుంట, తేనీళ్లవారికుంటలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం క్వాలిటీ కంట్రోల్ అధికారి ఆనంద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ అధికారి మాట్లాడుతూ ఉపాధిపనుల్లో నాణ్యత లోపించకుండా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పదన్నారు. కూలీలకు వంద రోజులకు తగ్గకుండా పనూలు కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉపాధి పథకం ముఖ్యఉద్దేశం అమలకు ప్రతి ఒక్కరు కషి చేయాలని తెలిపారు. ఏపీవో షౌకత్ అలీ, జేఈ కష్ణయ్య, ఎఫ్ఏ దామోదర్ రెడ్డి, కూలీలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పించండి

ప్రజాశక్తి- యాదమరి: కౌమార దశలో గర్భధారణ జరగకుండా కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని జిల్లా గణాంకాల అధికారి జార్జ్ పిలుపునిచ్చారు. సోమవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఎస్ఓ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలలు లక్ష్య సాధనపై దష్టి పెట్టేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా ఆరోగ్య కార్యకర్తలే మైనర్ వివాహాలను నిలుపుదల చేసేందుకు కషి చేయాలన్నారు. అలాగే నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేందుకు ఆశా నుండి వైద్యాధికారి వరకు వారివారి స్థాయిని బట్టి కషి చేయాలన్నారు. జిల్లా వైద్యవిద్య అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ ఆర్‌సిహెచ్‌లో గర్భవతులకు చిన్నారులకు అందిస్తున్న ప్రతి సేవను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అలాగే ఎన్సిడి సిడి సర్వేను 100శాతం పూర్తి చేయాలని ఎవరైనా ఇంకా లక్ష్యాలను పూర్తి చేయని వారు సత్వరం పూర్తి చేయాలన్నారు. ఈసమావేశం కమ్యూనిటీ హెల్త్ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. హెల్త్ సూపర్వైజర్ అనసూయమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మదర్ థెరిసా ప్రిన్సిపాల్‌కు 'నేషనల్ స్కూల్ అవార్డు'



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండల పరిధిలోని మదర్ థెరిస్సా సిబిఎస్సి పాఠశాల ప్రిన్సిపాల్ డేవిడ్ నేషనల్ స్కూల్ అవార్డు అందుకున్నట్లు స్కూల్ డీన్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నేషనల్ స్కూల్ కాంక్లేవ్ అండ్ అవార్డ్స్ వారు నిర్వహించిన నేషనల్ స్కూల్ అవార్డ్స్ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం హోటల్ తాజ్ వివాంత్ న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బెస్ట్ ఎడ్యుకేషన్ లీడర్ ఆఫ్ 2023గా మదర్‌థెరీసా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డేవిడ్ ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్ నుండి మదర్‌థెరిసా పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని, జాతీయస్థాయిలో పాఠశాలకు గుర్తింపు రావడం సంతోషమని అందు కషి చేసిన పాఠశాల ప్రిన్సిపల్ డేవిడ్‌ను ఆయన అభినందించారు. పాఠశాల డీన్ వై.మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



ప్రజాశక్తి- పాలసముద్రం: మండలంలోని కేజే పురం గ్రామసంఘంలో షణ్ముగరెడ్డి అనే రైతు వేసి వేరుశనగ పంట యూనివర్సల్ మాడల్‌ను డిపిఎం వాసు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సలహా సూచనలు ఇచ్చారు. పిఎండిఎస్.బాబురెడ్డి రైతుతో మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయం చేయడం, సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వలన పంట అధిక దిగుబడితో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చు అని అన్నారు. అలాగే గ్రామాల్లో కిచెన్ గార్డెన్ నిర్వహిణ గురించి వివరించారు. అనంతరం ఎస్‌కెఆర్.పురంలోని రైతులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి రైతులకు కిచెన్ గార్డెన్, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిసి.లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

బాల శాస్త్రవేత్తలకు సదావకాశం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇన్ స్పైర్ మనక్‌తో బాలశాస్త్రవేత్తలకు చక్కని అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా సమగ్రశిక్ష సీఎంవో సురేష్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో సోమవారం డివిజన్ స్థాయిలోని అన్ని యాజమాన్యాల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్ స్పైర్ నామినేషన్ల ప్రక్రియపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లోని మేథాశక్తిని వెలికి తీసేందుకు ఇన్ స్పైర్ మనక్ ఎంతగానో ఉపయోగ పడు తుందున్నారు. ఇందుకు గాను నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభంమైనట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉన్నత పాఠశాలలు ఐదు ప్రాజెక్టులు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులకు సంబంధించి నామినేషన్లను ఈనెల 31 లోపు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈవో బాలయ్య, ప్రధానోపా ధ్యాయురాలు రాజేశ్వరి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మేఘనాథ్, సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైరవిహారం



ప్రజాశక్తి - పాలసముద్రం: మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీలోని ప్రతి గ్రామంలో సుమారు 20 నుంచి 30 పైగా వీధికుక్కలు ఉన్నాయి. గ్రామాలలో స్వేచ్ఛగా గుంపులుగా స్వైరవిహారం చేస్తూ కనపడిన వద్దులు, చిన్నారులు, మహిళలపై దాడులకు తెగబడుతున్నాయి. వీధి కుక్కల దాడులు రోజు రోజుకు పెరుగుతుండడంతో చిన్నపిల్లలు, వద్దులు రోడ్డు వెంబడి నడవాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక రాత్రి వేళలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ గ్రామస్తులకు, వాహనదారులకు దడ పుట్టిస్తున్నాయి. వీధి కుక్కల బెడద తీవ్ర రూపం దాల్చుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా కనీసం కుక్కలను కట్టడి చేయకపోవడం శోచనీయం. మండలంలో వనదుర్గాపురం, శ్రీకావేరిరాజాపురం పాలసముద్రం గ్రామాలలో ఎక్కువగా వీధి కుక్కలు ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. ఇటీవల నిత్యం కుక్క కాటు బాధితులు అనేకమంది ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందిస్తున్న అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు. ఇదే విధంగా కొనసాగితే చిన్నారుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నట్లే. ప్రజాప్రతినిధులు, అధికారులు దాడులు స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని ఎద్దులవారిపల్లి గ్రామంలో చోటుచేసుకంది. సీఐ నాగరాజురావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎద్దులవారిపల్లి గ్రామానికి చెందిన చిలకమ్మా బంధువుల ఇంటిల్లో శుభకార్యానికి వెళ్ళింది. ఇది గమనించిన దుండగులు ఆదివారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోని 16 గ్రాముల బంగారు, మూడు వెండి చైన్లను చోరీ చేసిన నట్టు బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు సిఐ తెలిపారు.

నేటి నుంచి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో నేటి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించనున్నట్లు మండల మాజీ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ హేమంబరు గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసైకిల్ యాత్ర గుడిపల్లి మండలంలోని బేగిలిపల్లి గ్రామపంచాయతీ నుండి ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కుప్పం నియోజకవర్గం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు లక్ష మెజారిటీ లక్ష్యంగా ఈ సైకిల్‌యాత్ర కొనసాగుతుందని అన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలో సైకిల్‌యాత్ర నాలుగు రోజులు యువత ద్వారా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని ఈ సైకిల్‌యాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని బొట్లవారిపల్లి గ్రామానికి చెందిన రమేష్ (45) ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి బొట్లవారిపల్లి గ్రామానికి వచ్చి ఆయన మతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట టిడిపి మండల మాజీ అధ్యక్షులు పి.మోహన మురళి, తెలుగు యువత ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి, గ్రామస్తులు మోహన్ నాయుడు, అయ్యప్ప నాయుడు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు వరప్రసాద్, మండల ఐటీడీపి అధ్యక్షులు కార్తీక్ ఉన్నారు.

నేడు మహిళా కళాశాలలో సాహితీ సదస్సు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్, దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు మహిళా కళాశాలలో తాళ్లపాక అన్నమాచార్య సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల కమిటీ సభ్యులు డాక్టర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. అనంతరం అన్నమాచార్య సంగీత కార్యక్రమం ఉంటుందని.. ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



ప్రజాశక్తి-కోట: గూడలిలోని ప్రకాశం కాలనీకి చెందిన యనమల వెంకటేశ్వర్లు మృతి చెందడంతో తక్షణ సాయంగా అధికారులు సోమవారం రూ.10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందిం చారు. సెక్రటరీ కిరణ్ కుమార్, జడ్పీటీసీ కోటయ్య పాల్గొన్నారు.

లాడ్జిలో ఉరేసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: లాడ్జిలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని అజంతా లాడ్జిలో చెన్నైకి చెందిన అరుణ్ గణేష్ (41) శనివారం గది అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం తలుపులు తెరవకపోవడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి తాళాలు తొలగించి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.